క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాలు పరిశీలన


సోన్‌లో నాయకులతో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

ఖానాపూర్: పట్టణంతోపాటు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పరిశీలించారు. కేంద్రాల వద్ద ఓటింగ్ తీరుతో పాటు పోలింగ్ శాతాన్ని తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు దయానంద్, నిమ్మల రమేశ్, వైస్ చైర్మన్ సంతోష్ ఉన్నారు.

సోన్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అకాల వర్షం..అపార నష్టం


మల్లాపూర్‌లో నేలకొరిగిన వరి

లక్ష్మణచాంద: మండలంలో అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, మల్లాపూర్, పీచర, ధర్మారం, పార్‌పెల్లి, మునిపెల్లి, చింతల్‌చాంద తదితర గ్రామాల్లో ఆదివారం ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు వర్షం కురిసింది. పలుచోట్ల ధాన్యం తడిసి, కొట్టుకుపోయింది. మూడు ట్రాక్టర్ల ధాన్యం ఆరబెట్టగా కురిసిన వానకు ట్రాక్టర్ ధాన్యం కొట్టుకుపోయిందని మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు కూన పద్మ వాపోయింది. పలుచోట్ల వరి, నువ్వుల పంటలు నేలకొరిగాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వారికి ఓటు.. ప్రయాణికులకు లేటు!


బస్సు కోసం వేచి ఉన్న తల్లీకూతుళ్లు

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం నుంచే బస్సు సర్వీసులు అందుబాటులో ఉండాల్సి ఉండగా, దాదాపు 9 గంటల వరకు బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో పలువురు ప్రయాణికులు వారివారి గ్రామాల్లో ఓటేసేందుకు బస్టాండ్ చేరుకోగా, బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. విచారణ కేంద్రంలో అడిగితే కండక్టర్లు, డ్రైవర్లు ఓటేసేందుకు వెళ్లారని, బస్సులు ఆలస్యంగా నడుస్తాయని సమాధానమిచ్చినట్లు ప్రయాణికులు వాపోయారు. ఈ విషయమై డీఎంను ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు.

వాహనాల తనిఖీ

ఖానాపూర్: పట్టణంతోపాటు వివిధ గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. జెడ్పీటీసీ జానుబాయి వాహనాన్ని ఆపి తనిఖీ చేపట్టారు.

ఆకట్టుకున్న మోడల్ పోలింగ్ బూత్


కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్‌లోని ఈద్గాంలో అధికారులు ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ బూత్‌ను ఓటర్లను ఆకట్టుకుంది. తోరణాలు కట్టి పచ్చని పందిరి వేసి వారి కోసం కార్పెట్ పరిచారు. అక్కడ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

వైభవంగా కల్యాణోత్సవం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని హరిహరక్షేత్రం మల్లన్నగుట్ట ఆలయంలో వల్లి దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. పురోహితులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త అల్లోల వినోదమ్మ, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సతీమణి విజయమ్మ, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బద్రి శీను పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతం

- కేంద్రాల వద్ద జనం బారులు
- ఓటేసిన యువ ఓటర్లు
- పోలీసుల బందోబస్తు

పార్లమెంట్ ఎన్నికలు జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. క్యూలో నిల్చొని వరుస క్రమంలో ఓటేశారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం కేంద్రాల వద్ద సిబ్బంది వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. పలువురు యువ ఓటర్లు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేలి సిరాచుక్కా చూపి సెల్ఫీ దిగారు. కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


భైంసాటౌన్: పులేనగర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 7.20 గంటలకే క్యూలో ఓటర్లు


ముతాపూర్‌లో ఓటేయడానికి క్యూలో మహిళా ఓటర్లు

నిర్మల్‌రూరల్ మండలంలో..

నిర్మల్‌రూరల్: మండలంలో 63 శాతం పోలింగ్ నమోదైంది. ఎండ కారణంగా ఓటరుల ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటేశారు. మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన స్వగ్రామమైన ఎల్లాపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మేడిపల్లి, ముతాపూర్, సీలాయపేట, అనంతపేట, చిట్యాల గ్రామాల్లోని కేంద్రాల వద్ద మహిళా ఓటర్లు బారులు తీరారు. అనంతపేటలో తాను ఓటు వేస్తుండగా మొబైల్ ఫోన్లో చిత్రీకరించాడు. ఈ విషయాన్ని వెబ్ కాస్ట్‌లో గుర్తించిన అధికారులు అతని మొబైల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


పులేనగర్‌లో బారులు తీరిన ఓటర్లు

భైంసాలో..

భైంసాటౌన్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ సోమవారం పట్టణంలో ప్రశాంతంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సమస్యాత్మక, సున్నిత ప్రదేశాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎండలో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి కనిపించారు. కాగా, 130,138 ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రక్రియ 15–30 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. 138,137 కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమైన తర్వాత ఈవీఎంలలో సాంకేతిక సమస్య కారణంగా మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వెంటనే టెక్నికల్ సిబ్బంది చేరుకుని సరిచేశారు. రైతు విశ్రాంతి భవనంలో ఒకేచోట మూడు పోలింగ్ కేంద్రాలు ఉండడంతో ఓటర్లు భారీగా క్యూలో వేచి ఉన్నారు. పోలింగ్ ప్రక్రియ సైతం నెమ్మదిగా నిర్వహిస్తున్నారని క్యూలో నిల్చోలేక అసహనం వ్యక్తం చేశారు. ఇక, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కిసాన్‌గల్లి శ్రీసరస్వతి శిశుమందిర్, రైతు విశ్రాంతి భవనంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ జానకి షర్మిల పరిశీలించారు. ఎండ భయంతో దాదాపు మధ్యాహ్నం వరకే 60 శాతం వరకు పోలింగ్ పూర్తి కాగా, మిగిలిన వారు సాయంత్రం ఒక్కొక్కరుగా కేంద్రాలకు చేరుకుని ఓటేశారు.


భైంసా మండలం దేగాంలో బారులు

భైంసారూరల్: దేగాం గ్రామంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల్లో ఓటర్లు బారులు తీరి కనిపించారు. మహాగాం పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ జానకిషర్మిల పరిశీలించారు. పోలింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భైంసా రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై శ్రీకాంత్ ఉన్నారు.


ఓటేసిన విఠల్‌రెడ్డి

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: మండలంలో పోలింగ్ 77 శాతం నమోదైందని మండల సెక్టోరియల్ అధికారి గణేశ్ తెలిపారు. రాజూర, పిప్రి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యమైంది. మొత్తం 29,101 ఓటర్లు ఉండగా ఇందులో 23, 446 మంది ఓటర్లు ఓటు వినియోగించుకున్నారు. కేంద్రాల వద్ద బందోబస్తును నిర్వహించినట్లు ఎస్సై రాజు తెలిపారు.



లోకేశ్వరం: నగర్‌లో నిరీక్షిస్తున్న ఓటర్లు

కుభీర్‌లో..

కుభీర్: మండలంలో 73.42 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కుభీర్‌లో 37 పోలింగ్ కేంద్రంలో ఉదయం కొద్దిసేపు ఈవీఎం మిషన్ మొరాయించింది. అధికారులు సరిచేశారు. క్యూలో ఉన్న ఓటర్లు వేచిచూశారు.


కుభీర్‌లోని పోలింగ్ కేంద్రంలో క్యూలో ఓటర్లు


ఓటేసిన మాజీ ఎమ్మెల్యే


పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: పట్టణంలోని 17, మండలంలోని 33 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటేశారు. చివరి నిమిషంలో పలువురు ఓటు వేయక వెనుదిరిగారు. శాంతినగర్ కాలనీలోని 237 పోలింగ్ బూత్‌లో ఈవీఎం కాసేపు మొరాయించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎంపీడీవో కార్యాలయం పోలింగ్ కేంద్రంలో మాజీ ఏపీపీఎస్సీ మెంబర్ రవీందర్‌రావు ఓటేశారు. శాంతినగర్‌లోని ఒడ్డెవాడ పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


ఓటు వినియోగించుకున్న ఎంపీపీ పద్మ దంపతులు


లక్ష్మణచాందలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగింది. పొట్టపెల్లి(కే) గ్రామంలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ కొద్ది సేపటికే ఈవీఎం మొరాయించింది. అరగంట తర్వాత టెక్నికల్ సిబ్బంది సరిచేశారు. మళ్లీ మొరాయించడంతో గంటన్నర వరకు పోలింగ్ నిలిచిపోయింది. నిర్మల్ నుంచి నూతన ఈవీఎం తేవడంతో పోలింగ్ కొనసాగింది. మండలంలో మొత్తం 24,145 ఓటర్లు ఉండగా ఇందులో 18,925 ఓట్లు పోలయ్యాయి. 78.3 శాతం పోలింగ్ నమోదైంది.

ఓటేసిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము ఆయన సతీమణితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



కడెంలో..


కొండుకూర్‌లో ఓటేసిన యువకులు

కడెం: మండల కేంద్రంతోపాటు, గ్రామాల్లోని మొత్తం 36 కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొత్త మద్దిపడగలో ఈవీఎం మొరాయించడంతో అరగంట పోలింగ్ నిలిచిపోయింది. అల్లంపల్లి, బాబానాయక్ తండాల్లో గ్రామస్తులు ఓటింగ్ బహిష్కరించడంతో మధ్యాహ్నం పోలింగ్ ప్రారంభమైంది. కొండుకూర్‌లో యువకులు కొత్తగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నర్సాపూర్(జి)లో..


క్యూలో ఓటర్లు

నర్సాపూర్(జి): గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి ఓటేశారు. దివ్యాంగులు, వృద్ధులను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు జమాతే ఇస్లామిక్ ఆధ్వర్యంలో ఆటో సౌకర్యం కల్పించారు. ఆటోడ్రైవర్ కలీం వారిని కేంద్రాలకు తీసుకెళ్తున్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ పరిశీలించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

కుంటాలలో..

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ 53 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో 40 నిమిషాల పాటు పోలింగ్ నిలిచింది. ఎండ కారణంగా మధ్యాహ్నం పోలింగ్ మధ్యాహ్నం మందగించింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేశారు. లింబా(కె)లో తొలిసారి ఓటేసిన విద్యార్థులకు డీఆర్డీవో విజయలక్ష్మి అభినందనలు తెలిపారు. అందాకూర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. లింబా(కె)లో ఏర్పాటుచేసిన వ్యవసాయ నేపథ్య పోలింగ్ కేంద్రాన్ని డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించారు. మామిడి ఆకులతో తోరణాలు కట్టి, పచ్చని పందిరి వేసి పూలు చల్లుతూ ఓటర్లను ఆహ్వానించారు. పచ్చని వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్న రైతులతో కలిసి డీఆర్డీవో విజయలక్ష్మి సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు.


ఓలాలో క్యూలైన్‌లో ఓటర్లు

ఓటేసిన 97 ఏళ్ల వృద్ధురాలు



సోన్‌లో..

సోన్: మండలంలోని జాఫ్రపూర్ గ్రామానికి చెందిన 97 ఏళ్ల వృద్ధురాలు బోడ ఎల్లవ్వ తన ఓటు హక్కును వినియోగించుకుంది. 142వ బూత్ నంబర్‌లో జీపీ సిబ్బంది సహాయంతో పోలింగ్ కేంద్రానికి వీల్‌చైర్‌లో వచ్చి ఓటేశారు. అదే విధంగా న్యూవెల్మల్ గ్రామంలో ఓటింగ్ శాతం పెంచడానికి యువ ఓటర్లకు అధికారులు, కార్యదర్శి భూపాల్‌రెడ్డి డప్పుచప్పుళ్లతో స్వాగతం పలికారు. ఎఫ్ఏ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


ఎడ్‌బిడ్‌లో ..

ముధోల్‌లో..

ముధోల్: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 73 శాతం పోలింగ్ నమోదైంది. చించాల గ్రామంలో అరగంట పాటు, తరోడాలో 15నిమిషాల పాటు ఈవీఎంలు మొరాయించాయి.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండలంలోని 12 పంచాయతీల్లో 25 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచే మహిళలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ఓటేసేందుకు క్యూలో ఉన్నారు. దిలావర్‌పూర్, కాల్వ గ్రామాల్లో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. 20 నిమిషాల వ్యవధిలో తిరిగి పోలింగ్ యథావిధిగా కొనసాగింది. న్యూలోలం, దిలావర్‌పూర్ గ్రామాల్లో దాదాపు 8 మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ వినియోగించారని కేంద్రాల్లో ఓటేయడానికి అధికారులు నిరాకరించారు. పోస్టల్ బ్యాల్ వినియోగించారంటూ అధికారులు పేర్కొనడంతో కొద్దిసేపు అలజడి కొసాగింది. ఉన్నతాధికారులు పరిశీలించి వారికి ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు.


దిలావర్‌పూర్‌లో బారులు తీరిన మహిళలు

సారంగపూర్‌లో..

సారంగపూర్: మండల వ్యాప్తంగా 78.65 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. మొత్తం 38, 769ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు18, 021, మహిళలు 20,747, ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నారు. కాగా వీరిలో పురుష ఓటర్లు13, 637, మహిళా ఓటర్లు 16, 854ఓటర్లు మొత్తం 30491 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా బీరవెల్లి, సారంగాపూర్ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు పోలింగ్ బూత్‌ల సమీపంలో ప్రచారం నిర్వహించడంపై పరస్పరం విమర్శించుకోవడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడగా పోలీసులు చెదరగొట్టారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎస్సై చంద్రమోహన్ సిబ్బందితో పహారా నిర్వహించారు.


జామ్‌లో క్యూకట్టిన ఓటర్లు

పెంబిలో..

పెంబి: మండలంలో 76.34 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ లక్ష్మణ్ తెలిపారు. ఓటర్లు కేంద్రాలకు చేరుకుని సాయంత్రం వరకు ఓటేశారు. మహిళలు, యువతీ, యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్: మండలంలోని 20 కేంద్రాల్లో పోలింగ్ నెమ్మదిగా సాగింది. మధ్యాహ్నం వరకు ఓటర్లు కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మున్యాల, రేవోజీపేట, దస్తురాబాద్ కేంద్రాలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ పరిశీలించారు. మండలంలో 74.09 శాతం పోలింగ్ నమోదైంది.


రేవోజీపేటలో క్యూలైన్‌లో మహిళలు

మున్సిపల్ ఉద్యోగికి మూర్ఛ

జిల్లా కేంద్రంలోని బాగులవాడ పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది ఐన గంగన్న మూర్ఛతో కిందపడిపోయాడు. వివిధ పార్టీల కార్యకర్తలు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మున్సిపల్ కమిషనర్ అనుమతితో ఆస్పత్రికి తీసుకెళ్లారు.
- సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

